నేటి కందం- నేటికి అందం



గుచ్చుకొనెడి విషయములకు
విచ్చుకొనెడి పథములందు వివరణ లిడుచున్
చెచ్చెర దేశ మ్మంతయు
మెచ్చగ జరిపెదరు పార్లమెంటు సెషన్సున్ !!

పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభం

-రాధశ్రీ



సెల్:9494481210

# నేటి నిజం


తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

చురక

మన భాష మన యాస
మరవద్దనే మన నేతలు
తెరిస్తే చాలు నోటినండి
తిట్లు మహా బూతులు
అక్కసుతో రాజకీయ
అసహనం రోతలు
అన్నికూడా విలువతీసె
అంహంకార రీతులు

-వేల్పుల నారాయణ 9440433475



హైదరాబాద్ మంగళవారం 22-7-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-50 001 సంపుటి :31 సంచిక:260 పేజీలు:6 వెల: రూ.1/-


## అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్స్ పురోగతిపై రేవంత్ సమీక్ష



హైదరాబాద్, జులై 21: తెలంగాణ రైజింగ్-2047పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఇందుకు అనుగుణంగా అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్స్ అభివృద్ధి, పురోగతిపై అధికారులతో కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నేడు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కోర్సులు, శిక్షణ అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఏటీసీల అభివృద్ధి, పనుల్లో పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్దేశిత సమయానికి అనుగుణంగా వీలైనంత త్వరగా ఏటీసీల అభివృద్ధి పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు ముఖ్యమంత్రి.

ఏటీసీల అభివృద్ధి, పురోగతిపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని సీఎం వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో మూడు దశల్లో 111 ఏటీసీలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు అధికారులు. ఫేజ్-1లో 25, ఫేజ్-2లో 40, ఫేజ్-3లో 46 ఏటీసీలని అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. ఫేజ్-1, ఫేజ్-2లో ఇప్పటి వరకు 49 ఏటీసీలు అందుబాటులోకి వచ్చాయని వెల్లడించారు అధికారులు. ఏటీసీలను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు అవసరమైతే నైపుణ్యం కలిగిన నిర్మాణ సంస్థల సహకారం తీసుకోవాలని సూచించారు సీఎం రేవంత్‌రెడ్డి. జీనోమ్ వ్యాలీలో ఒక మోడల్ ఏటీసీని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు ముఖ్యమంత్రి. ఫార్మా, బయోటెక్నాలజీ, లైఫ్ సైన్సెస్ పరిశ్రమలకు అవసరమైన శిక్షణ అందించే కోర్సులు అక్కడ నిర్వహించాలని సూచించారు. అవసరమైన స్థలం కేటాయింపుతో పాటు అధునాతన సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

### గిగ్ వర్కర్స్ పాలసీపై సమీక్ష

గిగ్ వర్కర్స్ పాలసీపై సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షించారు. గిగ్ కార్మికులకు ప్రతిపాదిత పాలసీని సమీక్షలో ముఖ్యమంత్రికి వివరించారు అధికారులు. గిగ్ వర్కర్స్‌కు చట్టబద్ధమైన గుర్తింపు అంశాన్ని పాలసీలో ప్రతిపాదించారు అధికారులు. సంక్షేమబోర్డు ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రభుత్వం ప్రాతినిధ్యం వహించేలా ప్రతిపాదనలు చేశారు. గిగ్ కార్మికుల పాలసీపై అధికారులకు పలు సూచనలు చేశారు సీఎం రేవంత్‌రెడ్డి. గిగ్ కార్మికులకు సంబంధించిన పూర్తి డేటా ఆన్‌లైన్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు ముఖ్యమంత్రి. సంక్షేమ నిధి ఏర్పాటు చేయడంతో పాటు గిగ్ వర్కర్లకు ప్రమాద బీమా, హెల్త్ ఇన్స్‌రెన్స్ సౌకర్యాలను కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు.

## కేరళ మాజీ ముఖ్యమంత్రి అచ్యుతానందన్ కన్నుమూత

తిరువనంతపురం, జులై 21: కేరళ మాజీ ముఖ్యమంత్రి, సీనియర్ కమ్యూనిస్ట్ నాయకుడు వి.ఎస్. అచ్యుతానందన్ (101) కన్నుమూశారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో తిరువనంతపురంలోని ఎస్.యు.టి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన సోమవారం మధ్యహ్నం తుదిశ్వాస విడిచారు. గత నెల 23వ తేదీన ఆయనకు సడన్‌గా గుండె పోటు రావడంతో ఆయన హాస్పిటల్‌లో జాయిన్ అయ్యారు. అప్పటి నుంచి హాస్పిట్‌లోని వెంటిలేటర్ సహాయంతో చికిత్స పొందుతూ ఇవాళ తుదిశ్వాస విడిచారు.

### అచ్యుతానందన్ జీవిత విశేషాలు

వి.ఎస్. అచ్యుతానందన్ అలియాస్ వెలికాకత్ శంకరన్ అచ్యుతానందన్ 1923 అక్టోబర్ 20న అలప్పుజలోని పున్నప్రలో ఈయన జన్మించారు. ఈయన తల్లిదండ్రులు శంకరన్, అక్కమ్మ. అయితే ఈయన జన్మించిన కొన్ని రోజులకు తల్లిదండ్రులను చనిపోవడంతో.. ఆయన ఏడో తరగతితోనే అతనిపై కుటుంబ బాధ్యతలు పడ్డాయి. దీంతో అతని చదువు మానే ఉద్యోగం చేయడం స్టార్ట్ చేశారు. ఆ తర్వాత 1940లలో ఈయన కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా కార్యకర్తగా మారారు. పున్నప్ర వాయలార్ పోరాటంతో సహా కేరళ చరిత్రలో భాగమైన అనేక పోరాటాలలో ఆయన పాల్గొన్నారు.

అచ్యుతానందన్ 2006 మే 18 నుండి 2011 మే 14 వరకు కేరళ ముఖ్యమంత్రిగా పనిచేశారు. 1964లో అఖిఎ జాతీయ మండలి నుండి తప్పుకున్న 32 మంది నాయకులలో యూ కూడా ఒకరు. ప్రస్తుతం ఆయన అఖిఓ వ్యవస్థాపక నాయకులలో ఒకరిగా ఉన్నారు. ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుడు, అఖిఓ రాష్ట్ర కార్యదర్శి, పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఒఆఈ కన్వీనర్, ఇటీవల పరిపాలనా సంస్కరణల కమిషన్ ఛైర్మన్ పదవితో సహా అనేక పదవులను ఆయన నిర్వహించారు. అయితే నాలుగేళ్ల క్రితం గుండెపోటు రావడంతో అప్పటి నుంచి యూ క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్నారు.

## కళాశాల క్యాంపస్‌పై కూలిన ఎయిర్‌ఫోర్స్ విమానం..

### 19 మంది దుర్మరణం..! మృతుల్లో విద్యార్థులు, టీచర్లు..!



న్యూఢిల్లీ, జులై 21: బంగ్లాదేశ్ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన ఎఫ్-7 విమానం సోమవారం కళాశాల క్యాంపస్‌లో కూలిపోయింది. విమానం కళబూశాల భవనంపై కూలిపోయింది. ఈ ఘటనలో ఇప్పటి వరకు 19 మంది ప్రాణాలు కోల్పోగా.. 160 మందికిపైగా గాయపడ్డారు. ప్రమాదం జరిగిన సమయంలో మైల్‌స్టోన్ కళాశాలలో విద్యార్థులు ఉన్నారు. విమానం కూలిన తర్వాత కళాశాలలో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఆ తర్వాత సంఘటనా స్థలానికి అగ్నిమాపక, రెస్క్యూ బృందాలు సంఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టాయి. నేషనల్ బర్న్ ఇన్‌స్టిట్యూట్ అధికారి ప్రొఫెసర్ మొహమ్మద్ సైదుర్ రెహమాన్ మాట్లాడుతూ, మైల్‌స్టోన్ కళాశాల క్యాంపస్‌లో వైమానిక దళ విమానం కూలిపోయిందని చెప్పారు.

## ఆపరేషన్ సిందూర్‌లో మన సైనికులు వందశాతం లక్ష్యాలను సాధించారు

### -ఆపరేషన్ సిందూర్ విజయంతో ప్రపంచం దృష్టి మొత్తం మేడిన్ ఇండియా ఆయుధాలపైనే

### - ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ



న్యూ డిల్లీ జూలై 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఆపరేషన్ సిందూర్ తో మన దేశ సైనికుల సత్తా ప్రపంచం మొత్తం చూసిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. నేటి నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం అయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సమావేశాలు ప్రారంభానికి ముందు పార్లమెంట్ ఆవరణలో ప్రధాని మీడియాతో మాట్లాడారు. వర్షాకాల సమావేశాలు ఫలప్రదం కావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌లో మన సైనికులు వందశాతం లక్ష్యాలను సాధించినట్లు చెప్పారు. కేవలం 22 నిమిషాల్లోనే ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసినట్లు గుర్తు చేశారు. ఈ ఆపరేషన్‌తో మన సైనిక సామర్థ్యం, గొప్పతనం ప్రపంచం మొత్తం చూసిందన్నారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా మేడిన్ ఇండియా ఆయుధాల గురించే మాట్లాడుతోందన్నారు. ఉగ్రవాదాన్ని, నక్సలిజాన్ని నిర్మూలించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ప్రధాని పేర్కొన్నారు. 'ఆపరేషన్ సిందూర్' విజయం గురించి మన దేశ ఎంపీలు ప్రపంచంలోని వివిధ దేశాల్లో పర్యటించి వివరించారని మోదీ గుర్తు చేశారు. పాక్ దుష్ట చర్యలను అంతర్జాతీయంగా ఎండగట్టినట్లు చెప్పారు. తుపాకులు, బాంబులు ఉన్నా మన రాజ్యాంగం ముందు నిలబడలేకపోయాయని స్పష్టంచేశారు. ఈ వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో 'ఆపరేషన్ సిందూర్' విజయంపై వేడుక చేసుకోవాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. దేశ ప్రయోజనాల విషయంలో రాజకీయ పార్టీలూ, ప్రతీ ఒక్కరూ ఐక్యతతో ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా భారత వ్యోమగామి శుభాన్షు శుక్లా అంతరిక్ష యాత్ర గురించి కూడా ప్రధాని మోదీ ప్రస్తావించారు. శుభాన్షు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లి రావడంపై మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఐఎస్ఎస్‌లో మన జాతీయ జెండా ఎగరడం దేశ ప్రజలందరికీ గర్వకారణం అని కొనియాడారు. ఇక రైతుల జీవనోపాధి, దేశ ఆర్థిక వ్యవస్థ వర్షాలపై ఆధారపడి ఉందన్నారు.

## బ్రిడ్జిపై రైలు వెళ్తుండగా కూలిన బేస్ భాగం.. తప్పిన పెను ప్రమాదం

హిమాచల్ ప్రదేశ్ జూలై 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్ )హిల్ స్టేట్ హిమాచల్ ప్రదేశ్ లో గత కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న విషయం తెలిసిందే. ఈ వర్షాలకు ప్రధాన నదులకు వరద పోటెత్తుతోంది. పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడుతున్నాయి. తాజాగా భారీ వర్షాల కారణంగా హిమాచల్‌లో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. కాంగ్రా లోని ధంగులో చక్కి నది పై ఉన్న రైల్వే వంతెన బేస్ ఒక్కసారిగా కూలిపోయింది బ్రిడ్జిపై ఓ రైలు ప్రయాణిస్తున్న సమయంలోనే ఈ ఘటన చోటు చేసుకుంది. పఠాన్‌కోట్ మీదుగా ఢిల్లీ-జమ్ము మార్గంలో చక్కి నదిపై ఈ వంతెనను నిర్మించారు. అయితే భారీ వర్షాల కారణంగా నదికి వరద పోటెత్తింది. బ్రిడ్జి కింద ఉన్న పునాది భాగం ఒక్కసారిగా కూలిపోయింది. వందలాది ప్రయాణికులతో ఓ రైలు బ్రిడ్జిపై ప్రయాణిస్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. అయితే, అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రమాదం సంభవించలేదు.

దీంతో పెను ప్రమాదం తప్పినట్లైంది. ఈ ఘటనతో ఆ మార్గంలో రాకపోకలను అధికారులు నిలిపివేశారు. బ్రిడ్జి కింద బేస్ కూలుతున్న దృశ్యాలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి.

## పహల్గాం ఉగ్రదాడి ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు విపక్షాల పట్టు

### - సభలో పెద్ద ఎత్తున నినాదాలు..సభ వాయిదా



న్యూ డిల్లీ జూలై 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );పహల్గాం ఉగ్రదాడి ఘటన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను కుదిపేస్తోంది. ఈ ఘటనపై చర్చించాలంటూ విపక్షాలు లోక్‌సభలో నిరసనకు దిగారు. దీంతో దిగువ సభలో గందరగోళం నెలకొంది. స్పీకర్ ఎంత చెప్పినా సభ్యులు వినకపోవడంతో లోక్‌సభ ను వాయిదా వేయాల్సి వచ్చింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సోమవారం ఉదయం 11 గంటలకు ఉభయసభలు సమావేశమయ్యాయి. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత మొదటిసారిగా ఉభయ సభలు సమావేశమయ్యాయి. విపక్ష పార్టీలకు చెందిన ఎంపీలు పలు వాయిదా తీర్మానాలు ప్రవేశపెట్టారు. పహల్గాం ఉగ్రదాడి ఆపరేషన్ సిందూర్‌పై చర్చించాలంటూ పట్టుబట్టారు. అయితే, ప్రశ్నోత్తరాల తర్వాత వాయి దా తీర్మానాలపై చర్చ చేపడదామని స్పీకర్ ఓం బిర్లా నచ్చజెప్పారు. అయినా ఎంపీలు వినిపించుకోలేదు. సభలో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. విపక్షాల నిరసనల మధ్యే లోక్‌సభ మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి : కలెక్టర్ రాహుల్ రాజ్



మెదక్, జులై 21: ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స కోసం వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. సోమవారం హవేలీ ఘన్పూర్ మండలం సర్దన గ్రామం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు అందుతున్న తీరుపై కలెక్టర్ ఆరా తీశారు. ముందుగా సిబ్బంది హాజరు పట్టిక, ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు తదితర విషయాలపై వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

రోగులతో మాట్లాడి వైద్య సేవలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. అన్ని వసతులు సక్రమంగా ఉన్నాయా? ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిడి అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రం పరిధిలో సహజ ప్రసవాల సంఖ్య పెంచేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మందులు అన్నీ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని పేర్కొన్నారు.

## ఎయిర్ ఇండియా విమాన ప్రమాద ఘటనపై విదేశీ మీడియా అసత్య ప్రచారం చేస్తోంది

### -తుది నివేదిక వచ్చాకే ప్రమాద ఘటనపై మరిన్ని వివరాలు తెలుస్తాయి

### -పౌర విమానయాన మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు పార్లమెంట్‌లో కీలక ప్రకటన

న్యూ డిల్లీ జూలై 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );గత నెల అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాద ఘటనపై కేంద్ర పౌర విమానయాన మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు పార్లమెంట్‌లో కీలక ప్రకటన చేశారు. ప్రమాద ఘటనపై ప్రాథమిక నివేదిక వచ్చిందని.. దాన్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. తుది నివేదిక వచ్చాకే ప్రమాద ఘటనపై మరిన్ని వివరాలు తెలుస్తాయన్నారు. అయితే, ఈ ఘటనపై విదేశీ మీడియా అసత్య ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు సొంత అభిప్రాయాలు చెప్పడం సరికాదన్నారు. రాజ్యసభలో రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. 'ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై నిబంధనల ప్రకారమే దర్యాప్తు చేపట్టాం. అంతర్జాతీయ ప్రొటోకాల్ ప్రకారమే దర్యాప్తు కొనసాగుతోంది. ఈ ఘటనపై విదేశీ మీడియా అసత్య ప్రచారం చేస్తోంది. ఇప్పటికే ప్రాథమిక నివేదిక వచ్చింది. తుది నివేదికలో మరిన్ని వివరాలు తెలుస్తాయి. బ్లాక్‌బాక్స్ దెబ్బతిన్నా డేటాను రిట్రీవ్ చేశాం. బ్లాక్‌బాక్స్‌ను తొలిసారి డీకోడ్ చేయగలిగాం. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరకుండా చర్యలు తీసుకుంటున్నాం. విమానాశ్రయాల అభివృద్ధి, విస్తరణకు చర్యలు చేపట్టాం. సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

## తెలంగాణలో ఐదురోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు.. ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసిన వాతావరణశాఖ



హైదరాబాద్, జులై 21: తెలంగాణలో రాగల ఐదురోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో, ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. పశ్చిమ మధ్య-వాయువ్య బంగాళా ఖాతం, దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర, యానం మీదుగా సగటు సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవరణం ఉందని వాతావరణశాఖ పేర్కొంది. అలాగే, తూర్పు-పశ్చిమ ద్రోణి దక్షిణ కర్నాటక నుంచి దక్షిణ ఆంధ్రప్రదేశ్ వరకు సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతుందని తెలిపింది. ఈ నెల 24 నాటికి ఉత్తర బంగాళా ఖాతంలో కొత్తగా అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వివరించింది.

ఈ క్రమంలో సోమవారం కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయని చెప్పింది. మంగళవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, కామారెడ్డి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే సూచనలున్నాయంటూ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది.

ఇక ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, బలమైన ఈదురుగాలులతో భారీ వర్షాలు పడుతాయని హెచ్చరించింది. బుధవారం మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం జిల్లాల్లో అతిభారీ వర్షాలు.. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, మహబూబాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని వివరించింది. గురు, శుక్రవారాల్లో భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, ఖమ్మం జిల్లాల్లో బలమైన ఈదురుగాలతో కూడిన భారీ వర్షాలు పడేందుకు అవకాశం ఉందని వాతావరణశాఖ వివరించింది.

ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల, నాగర్ కర్నూల్, నల్గొండలో మోస్తరు నుంచి భారీ వర్షాపాతం నమోదైంది. అత్యధికంగా నల్గొండ జిల్లా ఉరుమడ్లలో 7.5, నాగర్ కర్నూల్ జిల్లాలో అచ్చంపేట 7.8, అమ్రాబాద్ 7, కుమ్మెర 6.8 సెంటీమీటర్ల వర్షాపాతం నమోదైందని వాతావరణశాఖ వివరించింది.

## విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు : ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట రూరల్, జూలై 21 : విధుల్లో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ వైద్య సిబ్బందిని హెచ్చరించారు. సోమవారం అచ్చంపేట వంద పడకల దవాఖానను ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు వైద్యులు నిరంతరం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్న వేళ వైద్యులు, స్టాప్ నర్సులు, సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని సూచించారు.

ఆగస్టు 6న అచ్చంపేట ఏరియా హాస్పిటల్‌లో మెఘా సర్జికల్ క్యాంప్

అచ్చంపేట ఏరియా హాస్పిటల్‌ను ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేసి వార్డులో ఉన్నటువంటి రోగులను పరామర్శించారు. రోగులకు అందుతున్న వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అచ్చంపేట ఏరియా హాస్పిటల్‌లో ఆగస్టు 6వ తేదీ నుండి మెగా సర్జికల్ క్యాంప్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అచ్చంపేట నియోజకవర్గ పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు డాక్టర్ మహేశ్ 95539 96060, నర్సింగ్ ఆఫీసర్ ఆంటోని 86399 71676 నంబర్లకు సంప్రదించాలని దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభు తెలిపారు.

# జాతీయ జెండా - జాతి సమైక్యతకు అండ !

## (22 జూలై "జాతీయ జెండా ఆమోదించిన దినోత్సవం" శుభ సందర్భంగా)

భారత జాతీయ జెండా రెపరెపలే 146 కోట్ల భారతీయుల గుండె లబ్ డబ్‌లు. దేశ ఔన్నత్యం, ఐక్యత, దేశ భక్తి, త్యాగం, జాతి గౌరవం, ఆకాంక్షలు, న్యాయం, సార్వభౌమాధికారం, శాంతి, సౌభాగ్యం, స్వేచ్ఛా స్వాతంత్ర్య పోరాటాలకు ఏకైక చిరునామాగా త్రివర్ణ పతాకం నిలుస్తున్నది. జాతీయ పతాకానికి వందనం చేస్తూ మనందరం మన దేశభక్తిని ప్రకటిస్తున్నాం, దేశాభివృద్ధికి బాటలు వేస్తున్నాం. మచిలీపట్నానికి చెందిన తెలుగు బిడ్డ పింగళి వెంకయ్య రూపొందించిన ప్రస్తుత త్రివర్ణ జాతీయ పతాకాన్ని 22 జూలై 1947న మన భారత రాజ్యాంగ సభ ఆమోదించడం, 15 ఆగష్టు 1947న భారత ప్రభుత్వం అధికారికంగా ఎగుర వేస్తూ అంగీకరించడం మన స్వతంత్ర భారత ఘన చరిత్రలో ఒక ముఖ్య ఘట్టంగా నిలిచి పోయింది. 22 జూలై 1947 రోజు మన జాతీయ పతాకాన్ని ఆమోదించడంతో ప్రతి ఏట జూలై 22న దేశవ్యాప్తంగా భారతీయులు "జాతీయ పతాక ఆమోద దినోత్సవం లేదా జాతీయ పతాక దినోత్సవం ( నేషనల్ ఫ్లాగ్ డే ఆర్ నేషనల్ ఫ్లాగ్ అడాప్షన్ డే)" రూపంలో అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవడం ఆనవాయితీగా మారింది.

త్రివర్ణ పతాకంలో దాగిన నిగూఢ అనంత అర్థాలు:

చేనేత వస్త్రంతో మాత్రమే రూపొందించబడుతున్న మన జాతీయ జెండా 2:3 నిష్పత్తితో దీర్ఘ చతురస్రాకారంలో మూడు రంగులతో, మధ్యలో నావీ-బ్లూ రంగు అశోక చక్రం అమర్చబడి అందంగా ఉంటుంది. జాతీయ పతాకంలోని పై భాగంలో "కాషాయ రంగు", మధ్యలో "తెలుపు వర్ణం", క్రింది భాగాన "ఆకు పచ్చ రంగు" సమాన భాగాలుగా అమర్చబడి ఉంటాయి. మధ్యలో ఉన్న తెలుపు వర్ణం కేంద్రంగా నావీ-బ్లూ రంగు కలిగిన "అశోక ధర్మ చక్రం" అమర్చబడి ఉంటుంది. పై భాగాన ఉన్న కాషాయ రంగు దేశ శక్తి సామర్థ్యాలకు, త్యాగ స్ఫూర్తి, ధైర్యాలకు ప్రతీకగా నిలుస్తున్నది. మధ్యలో ఉన్న శ్వేత వర్ణం శాంతి, స్వచ్ఛత, సత్యాలను సూచిస్తున్నది. క్రింది భాగాన ఉన్న హరిత వర్ణం సమృద్ధి, హరిత సంపద, శుభ ప్రదం, సమగ్రాభివృద్ధిలను ప్రకటిస్తున్నది. మధ్య తెలుపు వర్ణం కేంద్రంగా సత్య ధర్మాలకు ప్రతీకగా అశోక ధర్మ చక్రం అమర్చబడి ఉన్నది. అశోక చక్రం ప్రగతి రథాలకు చిరునామాగా, చక్రంలోని 24 చువ్వలు స్వేచ్ఛ భారత స్ఫూర్తి, 24 గంటలు నిరంతర ప్రగతి పరుగులను ప్రకటిస్తున్నది. చక్రంలోని సారనాథ్ సింహం ధైర్య, గంభీర, న్యాయ, సుస్థిరతను సూచిస్తున్నది.

### భారత జాతీయ పతాక చరిత్ర :

07 ఆగష్టు 1906న తొలిసారి ఆకు పచ్చ, పసుపు, ఎరుపు వర్ణాలతో కూడిన జాతీయ పతాకాన్ని అనధికారంగా కలకత్తాలో ఎగురవేశారు. 1907లో కాషాయం, పసుపు, ఆకు పచ్చ వర్ణాలతో కూడిన జెండాను బెర్లిన్ కమిటీ రూపొందించడం జరిగింది. అనంతరం అనీ బిసెంట్, బాల గంగాధర తిలక్‌లతో కూడిన దేశ భక్తులు ఐదు ఎరుపు చారలు, నాలుగు ఆకు పచ్చ చారలు, ఏడు నక్షత్రాలు, ఎడమ పై భాగాన యూనియన్ జాక్ సంతకంతో కూడిన పతాకాన్ని ఎగురవేయడం జరిగింది. 1921లో జరిగిన బెజవాడ అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సమావేశంలో తెలుగు తేజం పింగళి వెంకయ్య రూపొందించిన 30 రకాల పతాక నమూనాల్లోంచి ఐదింటిని అనధికారికంగా ఎంపిక చేశారు. 1931లో వెంకయ్య రూపొందించిన త్రివర్ణ పతాకం, మధ్యలో "చరకా" చేర్చబడింది. దేశ స్వాతంత్ర్యానికి కొద్ది రోజుల ముందు నేటి మన జాతీయ పతాకానికి తుది రూపం ఇస్తూ త్రివర్ణ పతాకం మధ్య భాగంలో "చరకా"కు బదులుగా "అశోక ధర్మ చక్రం" చేర్చబడింది. ఈ జాతీయ జెండాను 22 జూలై 1947న భారత రాజ్యాంగ సభ అధికారికంగా ఆమోదించడం ఒక అపూర్వ ఘట్టంగా దేశ స్వాతంత్ర్య చరిత్రలో నిలిచి పోయింది.

జాతీయ జెండా నియమ నిబంధనలు:

ప్రతి భారత పౌరుడు తన ఇంటి ఆవరణలో జాతీయ పతాకాన్ని ఎగుర వేసుకోవచ్చని 2002లో కోడ్ సవరణ చేయడం, 2005లో మరి కొన్ని అదనపు వాడుకలను అనుమతించడం జరిగింది. మన జాతీయ జెండాను ఉదయం ఎగుర వేసి సాయంత్రం సూర్యాస్తమయానికి ముందు వరకు ఉంచుకోవచ్చని, మతపరమైన సందర్భాల్లో వాడకూడదని, నేలకు గాని నీటికి గాని తగలకుండా చూసుకోవాలని, జాతీయ జెండా కన్న ఎత్తులో మరో జెండా ఉండకూడదనే నియమనిబంధనలు కూడా చేర్చబడినవి. జెండా ఎగుర వేసిన వెంటనే జాతీయ గీతాన్ని ఆలపించడం మనకు ఒక అలవాటుగా మారిపోయింది.

భరతమాత గుండె సవ్వడిగా నిలుస్తున్న మన జెండాకు మనందరం వందనం చేస్తూ, దాని ప్రాభవ వైభవాలకు అనునిత్యం కృషి చేస్తూ, దాని ప్రతిష్టను ఇనుమడింపజేస్తూ, మన జాతీయ పతాకానికి భక్తి శ్రద్ధలతో మనసారా నమస్కరిద్దాం. మన త్రివర్ణ పతాకాన్ని మదిలో నిలుపుకొని దేశాభివృద్ధి, ఐక్యత, శాంతి సామరస్యాల స్థాపనకు కృషి చేద్దాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచారంలో సామాజిక, మతపరమైన నాయకులు పాలు పంచుకోవాలి: డాక్టర్ మన్సుఖ్ మాండవీయ

న్యూఢిల్లీ, జులై 21:'వికసిత్ భారత్ కోసం నషా ముక్త యువత' అనే ఇతివృత్తంతో యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో నిర్వహిస్తోన్న 'యువజన ఆధ్యాత్మిక సదస్సు' ఇవాళ ప్రారంభమైంది. ఈ సదస్సులో దేశవ్యాప్తంగా 122 ఆధ్యాత్మిక, సామాజిక-సాంస్కృతిక సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తోన్న 600 మందికి పైగా యువజనులు పాల్గొన్నారు.

కేంద్ర యువజన వ్యవహారాలు-క్రీడలు, కార్మిక- ఉపాధి శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ మాట్లాడుతూ.. 2022 ఆగస్టు 15న ఎర్రకోట వేదిక నుంచి చేసిన 76వ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో అమృత్ కాల్ 'పంచ ప్రాణ్' ద్వారా రాబోయే 25 సంవత్సరాలకు సంబంధించిన దార్శనికతను ప్రధాని మోదీ పంచుకున్నారని అన్నారు. దేశ జనాభాలో 65 శాతం 35 ఏళ్ల కంటే తక్కువ వయస్సున్న వారేనని.. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చడంలో యువత కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

ఈ దార్శనికత సాకారం చేసుకునేందుకు దేశాన్ని మాదకద్రవ్య రహితంగా మార్చే అంశానికి ఉన్న ప్రాముఖ్యతను డాక్టర్ మాండవీయ ప్రధానంగా ప్రస్తావించారు. యువ తరాన్ని లబ్ధిదారులుగా మాత్రమే కాకుండా దేశ భవిష్యత్తు రూపకర్తలుగా కూడా చూడాలని అన్నారు. అయితే మాదకద్రవ్యాల దుర్వినియోగం నేడు యువత ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాళ్లలో ఒకటని వివరించారు. వ్యసనం వల్ల వారి జీవితాల్లో కీలకమైన దశ నాశనమై దేశ పురోగతికి తీవ్రమైన సవాలు విసురుతోందని పేర్కొన్నారు.

2047 నాటికి భారత్ అభివృద్ధి చెందాలంటే యువతను మాదకద్రవ్యాలు, మొబైల్ ఫోన్లు, రీల్స్ నుంచి దూరంగా ఉంచాలని అన్నారు.

వ్యసనానికి దూరంగా ఉండటం గురించి యువతలో అవగాహన కల్పించేందుకు సామాజిక, మతపరమైన నాయకులు తమ సంస్థలను ఉపయోగించాలని మంత్రి కోరారు. ఒక కార్యక్రమం లేదా పరిమిత చర్యలు సరిపోవని తెలిపారు. ఈ విషయంలో ప్రతి పౌరుడు కనీసం ఐదుగురు ఇతరులకు మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచారంలో పాలు పంచుకునేందుకు ప్రేరేపిస్తానని ప్రతిజ్ఞ చేసే ఒక సామూహిక ఉద్యమం అవసరమని అన్నారు.

ఈ రెండు రోజుల సమావేశం విలువైన చర్చలు, అర్థవంతమైన తీర్మానాలకు దారి తీస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. యువ, ఆధ్యాత్మిక నాయకుల సమష్టి ముందు చూపు, నిబద్ధతను ప్రతిబింబించేలా జూలై 20న 'కాశీ డిక్లరేషన్' విడుదల కానుంది. దీనితోనే సదస్సు కూడా ముగుస్తుంది. ఈ డిక్లరేషన్ మాదకద్రవ్య రహిత భారత్‌ను నిర్మించే విషయంలో వివరణాత్మక కార్యాచరణ ప్రణాళికను అందించనుంది. మాదక ద్రవ్యాల వ్యసనం నుంచి బయటపడటం, పునరావాసానికి సంబంధించి పనిచేసే పనిచేసే విధాన రూపకర్తలు, పౌర సమాజ సంస్థలు, యువజన నెట్‌వర్క్‌లకు మార్గదర్శక పత్రంగా ఇది పనిచేయనుంది. ఈ సదస్సులో వ్యసనం, యువతపై దాని ప్రభావాన్ని అర్థం చేసుకోవటం.. మాదకద్రవ్యాల అక్రమ రవాణా నెట్‌వర్క్‌లు- వాటి వాణిజ్య ప్రయోజనాలను నాశనం చేయటం.. సమర్థవంతమైన అవగాహన కార్యక్రమాలు, ప్రచార వ్యూహాలు.. 2047 నాటికి మాదకద్రవ్య రహిత భారతదేశం అనే దీర్ఘకాలిక లక్ష్యాన్ని సాధించటం అనే అంశాలపై నాలుగు సెషన్‌లు ఉండనున్నాయి. నిపుణుల చర్చలు, ప్యానెల్ చర్చలు, ఇంటరాక్టివ్ వైట్‌బోర్డ్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ఈ సెషన్‌లను నిర్వహిస్తున్నారు. సమగ్ర జాతీయ వ్యూహాన్ని రూపొందించడంలో ప్రతి ప్రతినిధి చురుకుగా పాల్గొనే విధంగా ఈ సదస్సు చూసుకుంటోంది.

# బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రయాణికుడి నుంచి రూ. 40 కోట్ల విలువైన 4 కిలోల కొకైన్ స్వాధీనం చేసుకున్న డీఆర్ఐ... ఒకరి అరెస్టు

న్యూఢిల్లీ, జులై 21:విశ్వసనీయ నిఘా వర్గాల సమాచారం మేరకు, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) బెంగళూరు జోనల్ యూనిట్ అధికారులు ఈనెల 18న తెల్లవారుజామున దోహా నుంచి బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చిన ఒక భారతీయ ప్రయాణికుడిని తనిఖీ చేశారు.

అతని లగేజీని జాగ్రత్తగా పరిశీలించగా, ఆ ప్రయాణికుడు అసాధారణ బరువు గల రెండు సూపర్ హీరో కామిక్స్ పుస్తకాలను తీసుకెళ్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఆ పుస్తకాల అట్టల్లో దాచిన తెల్లటి పొడిని స్వాధీనం చేసుకున్నారు.

ఆ పొడిలో కొకైన్ ఉన్నట్లు పరీక్షల్లో తేలింది. 4,006 గ్రాముల (4 కిలోల కంటే ఎక్కువ) బరువు, అంతర్జాతీయ మార్కెట్ విలువ దాదాపు రూ. 40 కోట్లుగా ఉన్న ఆ కొకైన్‌ను ఎన్‌డీపీఎస్ చట్టంలోని నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.

ఈనెల 18న ఎన్‌డీపీఎస్ చట్టం-1985 నిబంధనల కింద ఆ ప్రయాణికుడిని అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు.

# ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బంద్ ప్రశాంతం

**--జీవో 49 రద్దు చేయాలని ఆదివాసీ సంఘాల డిమాండ్**
**-డిపోలకే పరిమితమైన ఆర్టీసీ బస్సులు**
**-మూతపడిన వ్యాపార దుకాణాలు**

ఆదిలాబాద్, జులై 21: టైగర్ కారిడార్ పేరిట గిరిజనులు, గిరిజనేతరులు హక్కులకు విఘాతం కలిగించే జీవో 49 వెంటనే రద్దు చేయాలని



ఆదివాసీ సంఘాలు డిమాండ్ చేశాయి. ఆసిఫాబాద్ , కాగజ్‌నగర్ అటవీ డివిజన్ లో 339 గ్రామాలపై ప్రభావం చూపే జీవో నెంబర్ 49 ను వ్యతిరేకిస్తూ ఉమ్మడి అదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా చేపట్టిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. సోమవారం ఉదయం నుండి ఆదివాసీ సంఘాల ప్రతినిధులు ఆదిలాబాద్, ఉట్నూర్, ఆసిఫాబాద్, మంచిర్యాల డిపోల ఎదుట బైఠాయించి ఆర్టీసీ బస్సులను అడ్డుకున్నారు. గిరిజన ప్రాంతాల్లో అటవీ అధికారుల పెత్తనం సహించేది లేదని నినాదాలు చేశారు.

**తెల్లవారుజాము నుంచే**

ఆదిలాబాద్ ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఉదయం 4 గంటలకే ఆదివాసి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఆదివాసులు బైఠాయించారు. బస్సులను కదలని ఇవ్వకుండా అడ్డుకోవడంతో వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. ఉట్నూరు, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ లో ఆర్టీసీ బస్సులు డిపోకే పరిమితమయ్యాయి. మధ్యాహ్నం 12గంటల నుండి ఆర్టీసీ బస్సులు యధావిధిగా రోడ్డు ఎక్కాయి. మధ్యాహ్నం వరకు దుకాణాలు, వ్యాపార సంస్థలు మూసి ఉంచగా, ఆ తర్వాత తెరుచుకున్నాయి. పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. బంద్ ప్రశాంతంగా ముగియడంతో ఊపిరి పీల్చుకున్నారు.

**భూములపై హక్కులు కోల్పోతారు**

జీవో నంబర్ 49 అమలుతో ఆదివాసీలు సాగు చేసుకుంటున్న భూములపై హక్కులు కోల్పోతారని సంగం రాష్టనాయకులు గోడం గణేష్ అన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 49, టైగర్ జోన్ల ఏర్పాటు వల్ల ఆదివాసీలు తమ భూములను కోల్పోతారని, వారి జీవన విధానం దెబ్బతింటుందని ఆదివాసీ సంఘాల నేతలు పేర్కొన్నారు.

# పహల్గామ్ ఉగ్రదాడి ఇంటెలిజెన్స్ వైఫల్యమే ..
## రాజ్యసభలో ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఖర్గే

న్యూఢిల్లీ, జులై 21:భారత్-పాకిస్తాన్ సంఘర్షణ సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన శాంతి ఒప్పందం వాదనలపై రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పెహల్గామ్ దాడి గురించి మాట్లాడుతూ.. ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దాడి జరిగి నెలలు గడిచినా, ఆ ఉగ్రవాదులను ఇప్పటి వరకు పట్టుకోలేదు, వారి గురించి సమాచారం కూడా లేదన్నారు. నేడు వర్షాకాల పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. లోక్‌సభ, రాజ్యసభలలో చర్చలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై కీలక ప్రశ్నలు వేశారు.

తమ పార్టీ మాత్రమే కాదని,, అన్ని పార్టీలు దేశాన్ని బలోపేతం చేయడానికి, సైన్యానికి ధైర్యం నింపడానికి మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. కానీ, ఇప్పుడు అసలు పెహల్గామ్ దాడి జరిగిన దాని గురించి స్పష్టమైన సమాచారం కావాలని ఖర్గే డిమాండ్ చేశారు. ఇంటెలిజెన్స్ విషయంలో లోపం జరిగిందని లెఫ్టినెంట్ గవర్నర్ చెప్పారు. ఆ క్రమంలో ఆపరేషన్ సిందూర్ గురించి ప్రభుత్వం ప్రపంచానికి, భారత ప్రజలకు చెప్పింది. కానీ, ఆ తర్వాత ఏమైంది, ఏం జరిగిందో సమాచారం ఇవ్వాలని ఖర్గే కోరారు.

అమెరికా అధ్యక్షుడు ట్రంప్, భారత్-పాకిస్తాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరిందని 24 సార్లు పేర్కొన్నారని ఖర్గే గుర్తు చేశారు. ట్రంప్ ఈ విషయాన్ని ఎందుకు చెబుతున్నారు శాంతి ఒప్పందం జరిగిందా ఒకవేళ జరిగితే, దాని వివరాలు ఏంటి ప్రభుత్వం ఈ విషయంలో స్పష్టత ఇవ్వాలన్నారు. దేశ ప్రజలకు, పార్లమెంటుకు సమాచారం అందించడం ప్రభుత్వం బాధ్యత అని ఈ సందర్భంగా ఖర్గే గుర్తు చేశారు. ఈ దాడి వెనుక ఉన్న ఉగ్రవాదులను పట్టుకోవడంలో జాప్యం జరగడం, ఇంటెలిజెన్స్ వైఫల్యం గురించి ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. మన సైన్యం ధైర్యంగా పోరాడుతోంది. కానీ, ఇటువంటి సంఘటనలు మన భద్రతా వ్యవస్థలోని లోపాలను బయటపెడుతున్నాయి. ప్రభుత్వం ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

విపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే చేసిన వ్యాఖ్యలకు ప్రతిస్పందనగా ప్రభుత్వం మాట్లాడేందుకు సిద్ధంగా ఉందని, అన్ని వివరాలనూ దేశ ప్రజలకు తెలియజేస్తామని బీజేపీ నేత, రాజ్యసభలో లీడర్ ఆఫ్ ది హౌస్ జేపీ నడ్డా స్పష్టం చేశారు.

# వన మహోత్సవ వేడుకల్లో గౌరవ న్యాయమూర్తులు ఉత్సాహంగా పాల్గొనడం ప్రశంసనీయం: ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జులై 21:వన మహోత్సవ వేడుకల్లో గౌరవ న్యాయమూర్తులు ఉత్సాహంగా పాల్గొనడం ప్రశంసనీయమని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. పర్యావరణ బాధ్యత పట్ల పౌరులను ప్రేరేపించడంలో వారి పాత్ర కీలకమని పేర్కొన్నారు.

తమ మాతృమూర్తికి నివాళిగా మొక్కలు నాటేలా పౌరులను ప్రోత్సహించే లక్ష్యంతో దేశవ్యాప్తంగా చేపట్టిన "ఏక్ పేడ్ మా కే నామ్" కార్యక్రమానికి వారి భాగస్వామ్యం కొత్త ఊపునిస్తుందని ప్రధానమంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు.

ఢిల్లీ-ఎన్‌సీటీ మంత్రి శ్రీ మంజిందర్ సింగ్ సిర్సా 'ఎక్స్' వేదికగా చేసిన ఒక పోస్టుకు ప్రతిస్పందిస్తూ, ప్రధానమంత్రి ఇలా పేర్కొన్నారు:

"వన మహోత్సవంలో గౌరవ న్యాయమూర్తులు పాల్గొనడం అందరికీ స్ఫూర్తినిస్తుంది. ఇది 'ఏక్ పేడ్ మా కే నామ్' ప్రచారానికి కచ్చితంగా కొత్త ఊపునిస్తుందని నేను భావిస్తున్నాను."

ఆహ్వానము
తుమ్మోజు రామలక్ష్మణాచార్యులు రచన
సృష్టికర్త శతకము




ఆవిష్కరణ మహోత్సవము

తేది: 27 జూలై 2025 ఆదివారం సాయంత్రం గం.6లకు
వేదిక: రామ్మోహన్ గ్రంథాలయం, బందర్ రోడ్,
బందరు లాకులు దగ్గర, విజయవాడ

సభాధ్యక్షులు: డా॥ జి.వి.పూర్ణచంద్
శతాధిక గ్రంథకర్త

పుస్తక ఆవిష్కర్త: శ్రీ గబ్బిట దుర్గాప్రసాద్
అధ్యక్షులు, సరసభారతి

గ్రంథసమీక్ష: డా॥ గుమ్మా సాంబశివరావు
ప్రముఖ రచయిత, సాహితీవిమర్శకులు

ఈ సభకు మిమ్మల్ని హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నాము.

- చలపాక ప్రకాష్ వ్యవస్థాపక కార్యదర్శి
రమ్యభారతి సాహిత్య వేదిక

# ఎయిర్ ఇండియా ప్రమాద ఫైనల్ రిపోర్టు కోసం వెయిటింగ్ - కేంద్ర మంత్రి రామ్మోహన్

న్యూఢిల్లీ, జులై 21:అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమానం ఏఐ-171 ప్రమాదంపై దర్యాప్తు అంతర్జాతీయ ప్రోటోకాల్‌లకు అనుగుణంగా జరుగుతోందని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఈ దర్యాప్తును ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బోర్డ్ నిర్వహిస్తోం దన్నారు. ప్రమాదం ఎలా, ఎందుకు జరిగిందనే దానిపై సమగ్ర దర్యాప్తు కొనసాగుతోందని, తుది నివేదికలో పూర్తి వివరాలు వెల్లడవుతాయని మంత్రి అన్నారు. సోమవారం ప్రారంభమైన వర్షాకాల లోక్‌సభ సమావేశఃలో లో ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయగా, పౌర విమానయాన శాఖ మంత్రి స్పందించారు.

అందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మొదటి దశ దర్యాప్తు ఇప్పటికే పూర్తయిందన్నారు . ఈ దశలో ప్రాథమిక నివేదికను ఇప్పటికే దర్యాప్తు సంస్థ విడుదల చేసిన విషయాన్ని గుర్తు చేశారు. . విమానంలోని బ్లాక్ బాక్స్‌కు కొంత నష్టం జరిగిందని, సాధారణంగా, బ్లాక్ బాక్స్‌కు నష్టం జరిగినప్పుడు దానిని విశ్లేషణ కోసం తయారీదారుకు పంపడం ఆనవాయితీ అని చెప్పారు అయితే, ఈ సారి భారతదేశంలోనే మొదటిసారిగా బ్లాక్ బాక్స్ డీకోడింగ్ ప్రక్రియ విజయవం తంగా జరిగిందని మంత్రి రామ్ మోహన్ నాయుడు వెల్లడించారు. ఇది భారతదేశ పౌర విమానయాన రంగంలో ఒక ముఖ్యమైన విజయంగా ఆయన అభివర్ణించారు.

.దర్యాప్తు ప్రక్రియలో ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బోర్డ్ నిష్పాక్షికతను మంత్రి సమర్థించారు. కొన్ని విదేశీ మీడియా సంస్థలు ఈ ప్రమాదంపై తమ సొంత కథనాలను రూపొందించి తప్పుడు ప్రచారం చేస్తున్నాయన్నారు.

అలాంటి కథనాలను తాను గమనించానని, వాటిని నమ్మొద్దన్నారు.

ఈ సందర్భంగా, ఎయిర్ ఇండియా లేదా బోయింగ్ వంటి సంస్థలకు మద్దతు ఇవ్వడం కాదని, తమ లక్ష్యం కేవలం సత్యాన్ని వెలికితీసేందుకేనని రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. దర్యాప్తు ప్రక్రియను అందరూ గౌరవించాలని, నిజమైన సమాచారం తుది నివేదిక ద్వారా బయటకు వస్తుందని ఆయన వెల్లడించారు.

# కక్షపూరిత రాజకీయాలకు జగన్ బ్రాండ్ అంబాసిడర్ : మంత్రి జనార్ధన రెడ్డి

తిరుపతి, జులై 21:రాష్ట్రంలో అధికారంలో ఉన్నప్పుడు కేవలం కక్షతో పలు అనుచిత పనులు చేసిన జగన్ మోహన్ రెడ్డి కక్ష పూరిత రాజకీయాలకు బ్రాండ్ అంబాసిడర్ అని రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖల మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అన్నారు. ఇవాళ గూడూరు పర్యటనకు వెళ్తూ తిరుపతిలోని ఒక హోటల్ లో ఆయన తనను కలిసిన మీడియాతో మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు చేసిన తప్పులు బయటపడుతుంటే కక్షపూరిత రాజకీయాలని వైసీపీ నాయకులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.



వాస్తవానికి ప్రజావేదిక ను కూల్చింది కక్షపూరితంగా కాదా.. చంద్రబాబు పై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేసింది కక్షపూరితంగా కాదా అని ప్రశ్నించారు. చంద్రబాబు వ్యక్తిగత కక్షలకు వ్యతిరేకమని, కక్ష సాధింపులు లేని ప్రభుత్వం కాబట్టే ప్రజలు తమను గెలిపించారన్నారు. నాడు కక్షపూరిత రాజకీయాలు మొదలుపెట్టిన జగన్ కు నేడు అన్ని కక్షపూరితంగానే కనిపించడంలో ఆశ్చర్యం లేదన్నారు. ఎన్నికలకు ముందు నుంచి తాము లిక్కర్, శాండ్, ల్యాండ్ మాఫియాతో ప్రజల్ని దోచుకుంటున్నారని చెబుతూనే వచ్చామని, నాడు దోపిడీ చేసి, దేశ విదేశాల్లో దాచుకున్నదే నేడు పత్రికల్లో వెలుగులోకి వస్తున్నాయన్నారు.

దేశంలో ఎక్కడైనా డిజిటల్ చెల్లింపులు లేని ప్రభుత్వ వ్యవస్థ ఉందా.. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే సంస్థల్లో.. నగదు చెల్లింపులు జరుగుతాయా అనే ప్రశ్నలకు వైసీపీ వారే సమాధానం చెప్పాలన్నారు. అయినా మద్యం కుంభకోణంలో జరిగిన దోపిడీ బయటపెడ్తున్నది చంద్రబాబు, తెలుగుదేశం నాయకులు కాదని, సమగ్రంగా విచారించి దర్యాప్తు చేస్తున్న అధికారిక వ్యవస్థ అని చెబుతూ మద్యం కుంభకోణంలో అసలు నిందితులు ఎవరనేది త్వరలో వెలుగులోకి వస్తుందన్నారు. అధికారంలోకి వస్తుంటారు.. పోతుంటారు.. కానీ దర్యాప్తు సంస్థలు, వ్యవస్థలు.. తన పని తాను చేసుకుంటూ పోతాయని, ఈ దోపిడీలో భాగస్వాములైన వారికి శిక్ష తప్పదని, రూ.4 వేల కోట్ల దోపిడీ సొమ్ము ఎక్కడికి పోయాయి.. ఎవరికి చేరాయి.. అనేది కూడా బయటకు వస్తాయన్నారు. మద్యం కుంభకోణంకు సంబంధించి ఛార్జ్ సీట్ లో జగన్మోహన్ రెడ్డి పేరు ఉందని, విచారణ జరుగుతున్న అంశంపై అడిగిన ప్రశ్నకు జవాబిస్తూ విచారణ కొనసాగుతున్న సమయంలో మంత్రిగా తాను స్పందించలేనని అంటూ చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు.

రెడ్ బుక్ గురించి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో తప్పులు చేసిన వారి వివరాలు రెడ్ బుక్ లో ఉంటాయని, తప్పులకు పాల్పడిన వారిపై మాత్రమే చర్యలు ఉంటాయని అంటూ నాడు.. తప్పు చేసిన వారికి మాత్రమే నేడు రెడ్ బుక్ భయం పట్టుకుందన్నారు. మూడేళ్లలో ప్రభుత్వం పడిపోతుందని జగన్ అన్న మాటల పై స్పందిస్తూ? ఆ మాట చెప్పడానికి జగన్మోహన్ రెడ్డి ఎవరు.. ప్రజలు అనుకుంటే పడగొడతారు.. అవసరమైతే గెలిపిస్తారని, ఇంకా ఏడాది కూడా పూర్తి కాకుండానే అప్పుడే అధికారంపై అంత తొందరెందుకు అని అన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆర్కే రోజా వ్యాఖ్యలపై మంత్రి మాట్లాడుతూ.. ఒక మహిళను విమర్శించడం మేము సమర్ధించబోమని అంటూ గతంలో రోజా అధికారంలో మంత్రిగా ఉండగా ప్రతిపక్ష నేతలు, వారి కుటుంబాల గురించి ఏ భాషలో మాట్లాడారో కూడా గుర్తుంచుకోవాలని, ఆ మాటలు గుర్తొస్తే నాటి బాధితులకు కూడా బాధ కలుగుతుంది కదా అన్నారు.

తమ శాఖ గురించి మాట్లాడుతూ.. గతంలో ఆర్ అండ్ బీ శాఖ తల ఎత్తుకు తిరిగేదని, గత ఐదేళ్ల పాలనలో ఆర్ అండ్ బీ సేకరణ పూర్తిగా నిర్వీర్యం చేశారని అంటూ వైసీపీ ప్రభుత్వంలో 25వేల కి.మీ మేర గోతులు పడితే రూ.1200 కోట్లతో ఏడాది కాలంలోనే గుంతల రహితంగా తీర్చిదిద్దిన ఘనత తమ కూటమి ప్రభుత్వానిదన్నారు. గతంలో ఆర్ అండ్ బీ కాంట్రాక్టర్లు తల ఎత్తుకొని తిరిగేవారని, వైసీపీ ప్రభుత్వంలో వారు చేసిన బిల్లులు రాక ఎంతోమంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని, ఆరోపిస్తూ వైసీపీ హయాంలో చేసిన అప్పులు రూ.2500 కోట్లు తీర్చిన ఘనత కూడా తమ కూటమి ప్రభుత్వానిదేనని పేర్కొంటూ రాష్ట్రంలో త్వరలో కొత్త రోడ్ల నిర్మాణానికి డీపీ ఆర్ లు తయారు చేస్తున్నామన్నారు.

# ప్రతిరోజు విమాన సర్వీస్.. కేంద్ర మంత్రికి ఎంపీ శబరి వినతి



కర్నూలు, జులై 21:: కర్నూలు జిల్లా, ఓర్వకల్లు విమానాశ్రయం నుంచి రాష్ట్ర రాజధాని (అమరావతి) విజయవాడ కు ప్రతి రోజు విమాన సర్వీస్ ఏర్పాటు చేయాలని, విజయవాడకు వెళ్లే విమాన ప్రయాణికులకు అనువుగా సమయ మార్పులు చేయాలని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి కోరారు.

ఓర్వకల్లు విమానాశ్రయంకు గతంలో కేంద్ర ప్రభుత్వం హామీ మేరకు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరు పెట్టాలని కోరగా, త్వరలో అధికారిక ప్రకటన చేస్తామని కేంద్ర ఫౌర విమానాయశాఖ మంత్రి హామీ ఇచ్చినట్లు బైరెడ్డి శబరి తెలిపారు.

సోమవారం ఢిల్లీలో కేంద్ర పౌర విమానాయ శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ను ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ.. రాయలసీమ ప్రజల ఆకాంక్ష మేరకు దేశంలోనే బ్రిటిష్ పాలకులపై తొలి తిరుగుబాటు నాయకుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరు ఓర్వకల్లు (కర్నూలు ) ఎయిర్‌పోర్ట్ కు పెట్టాలని, అలాగే నైట్ ల్యాండింగ్ సదుపాయం కల్పించాలని, ఓర్వకల్లు (కర్నూలు ) నుంచి విజయవాడ డైలీ విమాన సర్వీస్ ఏర్పాటు చేయాలని, విజయవాడ విమానానికి ప్రయాణికులకు అనువుగా సమయ మార్పు చేయాలని, కొత్త మార్గం చెన్నై - తిరుపతి - ఓర్వకల్లు (కర్నూలు ) (సోమవారం నుంచి శుక్రవారం ) చెన్నై విమాన సర్వీస్ కొనసాగించాలని కేంద్ర ఫౌర విమానాయ శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడుకు వివరించడం జరిగిందని, అన్నింటినీ దృష్టిలో ఉంచుకొని తప్పకుండా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చినట్లు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి చెప్పారు.

# ఏకాదశి పర్వదినాన శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి మండల దీక్ష చారిటబుల్ ట్రస్ట్ గిరిప్రదక్షిణ



యాదగిరిగుట్ట, జూలై 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి మండల దీక్ష చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన గిరి ప్రదక్షణ ఆసాంతం ఆధ్యాత్మిక వాతావరణంలో శ్రీ స్వామివారి భజనలతో మారు మోగింది. ఉదయం 6 గంటలకు వైకుంఠ ద్వారం వద్ద శ్రీ స్వామివారి పాదాల చెంత నుండి ప్రారంభమైన గిరి ప్రదక్షణ గంటపాటు కొనసాగింది.

ఈ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు గంగు సత్తిరెడ్డి, ఉపాధ్యక్షుడు, ఈదులకంటి రమేష్ గౌడ్,ప్రధాన కార్యదర్శి పబ్బాల శ్రీరాములు మాట్లాడుతూ శ్రీ లక్ష్మీ పంచనారసింహుని నామస్మరణతో భక్తుల జీవితాలు పంచామృతంలా మారుతాయని అన్నారు. ప్రతి శనివారం, ప్రతి నెల శ్రీ స్వామి వారి స్వాతి నక్షత్రం రోజున, ఏకాదశి పర్వదినం రోజున, అలాగే శ్రీ స్వామివారి ప్రత్యేక సందర్భాలలో కూడా గిరి ప్రదర్శన కొనసాగించడం జరుగుతుందన్నారు.

# స్మైల్ ట్రైన్ ఇండియా గుడ్‌విల్ అంబాసిడర్‌గాసినీ నటి పావని గంగిరెడ్డి



హైదరాబాద్, జులై 21: గ్రహణం మొర్రి అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకొని స్మైల్ ట్రైన్ ఇండియా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల గుడ్‌విల్ అంబాసిడర్‌గా సినీ నటి, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ పావని గంగిరెడ్డి నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓరియంటేషన్ కార్యక్రమంలో అధికారికంగా ప్రకటించారు. ఈ భాగస్వామ్యంతో ప్రపంచవ్యాప్తంగా గ్రహణం మొర్రితో బాధపడుతున్న వ్యక్తులు, ఆయా కుటుంబాలకు ధైర్యం ఇవ్వడానికి స్మైల్ ట్రైన్ ప్రారంభించిన ప్రపంచ క్లెఫ్ట్ అవగాహనా దినోత్సవం (జూలై 20) సందర్భంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్మైల్ ట్రైన్ ఇండియాతో చేతులు కలపడం గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు. గ్రహణం మొర్రితో బాధపడుతున్న పిల్లలతో మాట్లాడితే మనస్సు చలించిపోయిందన్నారు. గ్రహణం మొర్రి చికిత్స శారీరక ఆరోగ్యానికి మాత్రమే కాకుండా, ఆత్మవిశ్వాసానికి ఎంతో అవసరమని తెలుస్తుందన్నారు. ఈ అంశంపై మరింత అవగాహన పెంచేందుకు నావంతు ప్రయత్నం చేస్తానని తెలిపారు.

ఈ సందర్భంగా స్మైల్ ట్రైన్ ఆసియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్, రీజినల్ డైరెక్టర్ మమతా క్యారల్ మాట్లాడుతూ పావనికి ప్రాంతీయంగా ఉన్న బలమైన అనుబంధం, ఆమెకు ఉన్న మానవీయ స్వభావం ఈ అంశంపై ప్రచారం చేయడంలో ఆమెను శక్తివంతమైన ప్రతినిధిగా నిలబెడతాయన్నారు. చికిత్స ఆలస్యమవడం వల్ల చాలా మంది తినడం, ఊపిరి పీల్చడం, మాట్లాడడం వంటి ప్రాథమిక విషయాల్లో ఇంకా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ ప్రచారం వల్ల నాణ్యమైన గ్రహణం మొర్రి చికిత్స ఉచితంగా అందుతోందన్న విషయం ఎన్నో కుటుంబాలకు చేరువవుతుందన్నారు.

ఈ సందర్భంగా బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ అండ్ రీసర్చ్ ఇన్‌స్టిట్యూట్ ప్లాస్టిక్ సర్జన్, స్మైల్ ట్రైన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ముఖుంద్ రెడ్డి మాట్లాడుతూ గ్రహణం మొర్రిపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. స్మైల్ ట్రైన్ వేసిన ఈ అడుగు సమాజంలో చురుకైన భాగస్వామ్యం, ముందస్తు జోక్యం, తగిన చికిత్స వంటి అంశాల్లో కొత్త దారులు తెరుస్తుందన్నారు. పిల్లలు ఎదుర్కొంటున్న సవాళ్లను వెలుగులోకి తీసుకురావడం, సమయానికి చికిత్స అందడం వల్ల కలిగే మార్పులను ప్రచారం చేయనున్నామని చెప్పారు. తెలంగాణలో 27,000 మందికి పైగా, ఆంధ్రప్రదేశ్‌లో 8,000 మందికి పైగా చిన్నారుల జీవితాలను స్మైల్ ట్రైన్ మార్చిందన్నారు. ఉచితంగా అందించిన గ్రహణం మొర్రి శస్త్రచికిత్స ద్వారా మార్గనిర్దేశం చేసిందన్నారు. ప్రతి రాష్ట్రంలో మూడు భాగస్వామ్య హాస్పిటల్స్ ద్వారా అందరికీ అందుబాటులో ఉండే నాణ్యమైన ఆరోగ్య సేవల వ్యవస్థను నిర్మిస్తోందని తెలిపారు.

# పసుపుబోర్డుతో ఇప్పటికీ ఏ రైతులకు లాభం చేకూరలేదు.. మాజీ జడ్పీటీసీ ఎలాల జలపతిరెడ్డి

## రాజకీయ లబ్ధి కోసమే బీజేపీ నాయకుల పాదయాత్ర

కరీంనగర్, జులై 21: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఏర్పాటు చేసిన పసుపు బోర్డుతో ఇప్పటికీ ఏ రైతుకు లాభం చేకూరలేదని, స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా రాజకీయ లబ్ధి కోసమే బీజేపీ నాయకులు పని గట్టుకోని చక్కెర కర్మాగారం పునరుద్ధరణ పేరిట పాదయాత్ర చేశారని మాజీ జడ్పీటీసీ, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి అన్నారు.

మండల కేంద్రంలోని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ బీజేపీ నాయకులు నిర్వహించిన పాదయాత్రలో జాతీయ పసుపుబోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలు సరికావని, రైతుల సంక్షేమం కోసం సర్కార్ నిరంతరం పనిచేస్తుందని, రానున్న రోజుల్లో ముత్యంపేట చక్కెర కర్మాగారం యుదావిధిగా ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. ఇక్కడ నాయకులు పూండ్ర శ్రీనివాస్ రెడ్డి, అంతడుపుల నరసయ్య, నల్ల రాజన్న, బద్దం నర్సారెడ్డి, సిరిపురం రవీందర్, నూతిపల్లి రాజం, మగ్రిపల్లి మల్లయ్య, సురేష్, కిరణ్, గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఖైదీలకు విద్యనందించేందుకు కృషి

## -అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి

## -చర్లపల్లి జైలులో పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమం

హైదరాబాద్, జులై 21: కేంద్ర కారాగారం అంటే శిక్షించే సంస్థ కాదని, శిక్షణ ఇచ్చే సంస్థగా గుర్తింపు తీసుకువచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి పేర్కొన్నారు. చర్లపల్లి కేంద్ర కారాగారంలో ఆదివారం ప్రొఫెసర్ రామిరెడ్డి మెమోరియల్ యాక్టివిటీస్‌లో భాగంగ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఖైదీల కోసం లీగల్ రైట్స్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ అంశంపై అవగాహన కారక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఘంటా చక్రపాణి మాట్లాడుతూ.. విద్య అందరికి అవసరమని, సమాజ అభివృద్ధి కోసం అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ కృషి చేస్తుందన్నారు. కేంద్ర కారాగరంలో శిక్ష అనుభవించే ఖైదీలకు విద్యను అందించేందుకు కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు.

### ఖైదీలు విద్యను అందిపుచ్చుకోవాలి..

అకాడమీ డైరక్టర్ ప్రొఫెసర్ పుష్ప చక్రపాణి మాట్లాడుతూ.. క్షణికావేశంలో చేసిన తప్పులను ఖైదీలు సరిదిద్దుకొని విద్యను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఇక్కడ నేర్చుకున్న విద్య జైలు జీవితం అనంతరం ఖైదీలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ శివకుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. కేంద్ర కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న ఖైదీల సంక్షేమానికి జైళ్ల శాఖ కృషి చేస్తుందని, ఇప్పటికే పలు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామని ఆయన తెలిపారు. అనంతరం ప్రొఫెసర్ బీనా చింతలపూరి కుటుంబం మానవ విలువలపై అవగాహన కల్పించగా ప్రొఫెసర్ మురళీకృష్ణ న్యాయం పొందే హక్కులపై అవగాహన కల్పించారు. అదేవిధంగా ప్రొఫెసర్ సుధారాణి ఖైదీల న్యాయమైన హక్కులు, వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్లు కాళిదాస్, శశికాంత్, రామయ్య, జైలర్ జ్యోతిర్మయిరెడ్డితో పాటు డిప్యూటీ జైలర్లు, వార్డెన్లు, ఖైదీలు పాల్గొన్నారు.





# స్థానిక సంస్థల ఎన్నికలకు బీఆర్ఎస్ కసరత్తు

హైదరాబాద్, జులై 21: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశాలు నిర్వహించాలని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారకరామారావు నిర్ణయించారు. కోర్టు ఆదేశాల నేపథ్యంలో త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు ప్రభుత్వ నిర్వహించే అవకాశం ఉందని వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ సమావేశాలతో స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సంసిద్ధం చేయాలని పార్టీ నేతలను ఆదేశించారు. జిల్లా పార్టీ అధ్యక్షులు తమ జిల్లాల్లోని ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ఈ సమావేశాలు నిర్వహించేలా సమన్వయం చేసుకోవాలని సూచించారు.

ఈ సమావేశాల్లో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, జడ్పీ చైర్మన్లు, కార్పొరేషన్ మాజీ చైర్మెన్ లు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సీనియర్ నేతలు పాల్గొనాలన్నారు

కేటీఆర్.తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీను అమలు చేయకుండా కాంగ్రెస్ చేస్తున్న మోసాలతో పాటు రేవంత్ ప్రభుత్వ అవినీతి, అప్రజాస్వామిక విధానాలు, వైఫల్యాలను గ్రామగ్రామాన విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు కేటీఆర్. రైతు బంధు ఇవ్వకుండా అన్నదాతలకు రేవంత్ సర్కార్ చేసిన ద్రోహాన్ని ప్రజలకు వివరించాలన్నారు.

రాష్ట్రంలో యూరియా, విత్తనాల కొరత తీవ్రంగా వేధిస్తున్నా కూడా ఈ ప్రభుత్వం ఆ సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైనాన్ని తెలియచేయాలన్నారు. అధికారంలోకి వచ్చిన 20 నెలల నుంచి సాగునీటి నుంచి విద్యుత్ సరాఫరా దాకా అన్నదాతలకు కాంగ్రెస్ చేస్తున్న మోసాన్ని చెప్పాలన్నారు. రేవంత్ ప్రభుత్వ చేతకానితనంతో పాలన అస్తవ్యస్తంగా మారి గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసిందన్న సంగతిని చెప్పాలన్నారు. బీసీలకు ఇస్తానన్న 42 శాతం రిజర్వేషన్ల విషయంలో చిత్తశుద్ధి లేని కాంగ్రెస్ సర్కార్ ఆర్డినెన్స్ పేరుతో ఆడుతున్న డ్రామాలను ప్రజలకు విడమిర్చి చెప్పాలన్నారు. ఇంతేకాకుండా వివిధ రంగాలకు డిక్లరేషన్ ల పేరుతో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఆయా రంగాలను మోసం చేసిన తీరును వివరించాలన్నారు.

వృద్ధులకు పెంచుతానన్న 4 వేల రూపాయల పెన్షన్ తో పాటు ఆడబిడ్డలకు నెలకు ఇస్తానన్న 2500 రూపాయలతో పాటు ఇతర హామీలను అమలుచేయకుండా కాంగ్రెస్ సర్కార్ చేస్తున్న ద్రోహాలను విడమరిచి చెప్పాలన్నారు కేటీఆర్. అన్ని వర్గాల ప్రజల తరపున గత 20 నెలల కాలం నుంచి కాంగ్రెస్ పార్టీ పైన భారత రాష్ట్ర సమితి చేస్తున్న ప్రజా పోరాటాలు, నిరసన కార్యక్రమాలను ప్రజలకు గుర్తుచేసేలా పార్టీ కార్యకర్తలను సమాయత్తం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాలను ఈ వారంలోనే ప్రారంభించి రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ముఖ్య కార్యకర్తల సమావేశాలు జరిగేలా చూడాలన్నారు.

# రామగుండం లయన్స్ క్లబ్‌లో గోరింటాకు వేడుక

హైదరాబాద్, జులై 21: నారీ లోకానికి ఆషాఢ మాసం అత్యంత ప్రియమైనది. ఈ మాసం చివరి వారం సోమవారం అతివలు గోరింటాకు వేడుకను సామూహికంగా కనుల పండువగా జరుపుకున్నారు. వైవిధ్య భరితమైన డిజైన్లతో చేతులను అలంకరించుకుని మురిసిపోయారు. రామగుండం లయన్స్ క్లబ్ భవన్‌లో సోమవారం మహిళలు గోరింటాకు వేడుకలను వైభవంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ వీపీ తానివర్తి విజయలక్ష్మి మాట్లాడుతూ.. రంగుల ఆనందాలు వెదజల్లే ఈ గోరింటాకు ఆరోగ్యాన్ని సైతం పెంపొందిస్తుందన్నారు. గోరింటాకులో వేడిని తగ్గించే గుణంతో పాటు రోగ నిరోధక శక్తి పెంచి రక్త ప్రసరణ జరిగేలా చేస్తుందన్నారు.

అలాగే శాస్త్రీయంగా గౌరీదేవికి ప్రీతి పాత్రమైన గోరింటాకును ఈ నెలలో ఒక్కసారైనా పెట్టుకోవడం సనాతన ధర్మంలో ఆచారంగా వస్తుందని తెలిపారు. అనంతరం మహిళలు మైదాకు చెట్టుకు భక్తి శ్రద్ధలతో గౌరీపూజ చేసి సహజ సిద్ధమైన గోరింటాలను అంతా కలిసి రోట్లో వేసి మెత్తగా నూరి పాటలు పాడుతూ మహిళలు ఒకరి చేతులకు మరొకరు పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పీఎస్ కళావతి, మనీషా అగర్వాల్, లయన్స్ పద్మ, సరోజ, నాగరాణి, ఉమ, శ్రీవాణి, షఫాలి, స్వరూప, కంసల్య, జయప్రద, సమత, రంగమ్మ, పార్వతి, అన్నపూర్ణ, ప్రీతి పాల్గొన్నారు.

# శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థకు అత్యాధునిక వైద్య పరికరాలు

హైదరాబాద్, జులై 21:: ఇండియన్ ఆయిల్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్)లో భాగంగా తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థకు రూ.22.01 కోట్ల గ్రాంట్‌ను మంజూరు చేసింది. ఈ గ్రాంట్ తో రెండు ప్రపంచ స్థాయి డయాగ్నస్టిక్ వ్యవస్థల ఏర్పాటుకు మార్గం సుగమం అయింది. అవి.. 3 టెస్లా ఎంఆర్ఐ స్కానర్ (14 కోట్లు), 4డి సీటీ సిమ్యులేషన్ సిస్టమ్ (8 కోట్లు). తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నడిచే ఈ వైద్య విద్యాసంస్థలో ఆరోగ్య సేవల సామర్థ్యం మరింత మెరుగుపడనుంది. ఈ అధునాతన పరికరాల ద్వారా ప్రతి ఏటా 2.5 లక్షల మందికి పైగా రోగులు ప్రయోజనం పొందనున్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు అత్యాధునిక వైద్య నిర్ధారణ, చికిత్స ప్రణాళిక సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఈ సందర్భంగా కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రి హర్దీప్ సింగ్ పూరి వర్చువల్ గా





మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ ఆయిల్ డైరెక్టర్ (మార్కెటింగ్) వీ సతీష్ కుమార్, టీటీడీ చైర్మన్ బొల్లినేని రాజగోపాల నాయుడు, టుడా చైర్మన్, టీటీడీ బోర్డు సభ్యుడు డాలర్ దివాకర్ రెడ్డి, శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ డైరెక్టర్, వైఎస్ ఛాన్సలర్ డాక్టర్ ఆర్వీ కుమార్, ఇండియన్ ఆయిల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (హెచ్ఆర్) ఎంఆర్ దాస్, సీజీఎం (ఎఫ్) ఏఆర్వీ బద్రీనాథ్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# దేవస్థానం పెన్షనర్ల సంఘ భవనానికి స్థలం

## -28వ పెన్షనర్స్ డే సమావేశంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య హామీ



యాదగిరిగుట్ట, జూలై 21 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: దేవస్థానం అభివృద్ధికి ,భక్తుల సేవలకు జీవితాంతం పనిచేసి పదవి విరమణ చేసిన ఉద్యోగస్తులు ఏర్పాటు చేసుకున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం పెన్షనర్ల సంఘ భవన నిర్మాణానికి అనువైన స్థలాన్ని కేటాయిస్తానని ఆలేరు ఎమ్మెల్యే ,ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య హామీ ఇచ్చారు ,సోమవారం యాదగిరిగుట్టలో జరిగిన పెన్షనర్స్ డే 28వ వార్షికోత్సవ సర్వసభ్య సమావేశానికి ఆయన విశిష్ట అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. దేవస్థానం అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, దేవస్థానం ఉప కార్యనిర్వహణాధికారి దోర్బల భాస్కర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఈ సమావేశానికి సంఘం కార్య నిర్వాహక అధ్యక్షుడు ఊడెపు నరసింహారావు అధ్యక్షత వహించారు. తమ సంఘ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ సంఘ ప్రధాన కార్యదర్శి కొక్కొండ యాదగిరి తదితరులు సమర్పించిన విజ్ఞాపన పత్రానికి ప్రభుత్వ విప్ ఐలయ్య సానుకూలంగా స్పందించారు. తగు స్థలంతో పాటు హెల్త్ కార్డులు ,అలాగే ఇతర సమస్యల గురించి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. సంఘం ఏర్పడి 28 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 65 నుండి 85 సంవత్సరాల వయసు పూర్తి చేసుకున్న సభ్యులకు ఘన సన్మానం చేశారు .దాదాపు 180మంది పాల్గొనగా 43 మందిని సన్మానించారు.

# కొత్త రేషన్ కార్డుల పంపిణీ మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



మహబూబాబాద్, జులై 21:(నేటినిజం ప్రతినిధి): మహబూబాబాద్ పెద్దవంగర మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. మరియు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం పాలకుర్తి శాసన సభ్యులు హనుమాండ్ల యశస్విని రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అర్హులైన లబ్దిదారులకు ఆహార భద్రత పథకం కింద కొత్త రేషన్ కార్డులు అందజేశారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి కొత్త రేషన్ కార్డు అందే వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.గతంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు పేదల పట్ల తీవ్ర అన్యాయం చేశాయని, గత పది సంవత్సరాలపాటు రాష్ట్రంలో ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా జారీ చేయలేదు. కాని ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ పాలనలో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం పేదల కష్టాలను అర్థం చేసుకుని, వారి సమస్యల పరిష్కారానికి నడుం బిగించింది. ఆహార భద్రతతో పాటు, రేషన్ కార్డు ద్వారా పేదలకు అనేక ప్రయోజనాలు లభిస్తున్నాయని, ఇది న్యాయమైన హక్కుగా పరిగణించాలని అన్నారు. పల్లె ప్రజలకు అండగా నిలిచే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు..ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముద్దసాని సురేష్, సీనియర్ నాయకులు జాటోత్ నెహ్రూ నాయక్, నెమరుగమ్ముల ప్రవీణ్ రావు మరియు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.


తెలంగాణ ప్రభుత్వం
తెలంగాణ సాహిత్య అకాడమి
ప్రముఖ సాహితీవేత్త
'స్వేచ్ఛా కవిత్వం' సృష్టికర్త
కీ॥శే॥ మాదిరాజు రంగారావు గారికి
అక్షర నివాళి



1935-2025
మాదిరాజు రంగారావు గారి
జీవితం-సాహిత్యంపై
డా.నాళేశ్వరం శంకరం గారి ప్రసంగం
తేది: 24.07.2025, సమయం : ఉ॥ 11.00 గంటలకు
వేదిక: తెలంగాణ సాహిత్య అకాడమి కార్యాలయం
సాహితీవేత్తలు, అభిమానులు,
కుటుంబసభ్యులు పాల్గొంటారు.
ఆహ్వానించువారు
డా.నామోజు బాలాచారి
కార్యదర్శి, తెలంగాణ సాహిత్య అకాడమి


Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.